# సహాయం

కేతవరపు వెంకట రమణామూర్తి
కేతవరపు వర్రేరాణి



**బస్ స్టాండ్** చాలా రద్దీగా ఉంది. బందరు బస్సులు బయలుదేరే ప్లాట్ ఫారమ్ అయితే కాలు పెట్ట లేనంత ఇరుకుగా, చెమట, సిగరెట్ వాసనలతో నిండి పోయుంది.

నాన్ స్టాప్ బస్సులకు ఎప్పుడూ స్టాండింగ్ టికెట్లివ్వని వాడు, పండగ ముందు రోజు రద్దీని తట్టుకోవడాని కన్నట్టు బస్సు కో ఇరవై ఎక్కువ టికెట్లు కొట్టేసి నట్టున్నాడు, బస్సంతా నిండి పోయుంది. నంబర్ల ప్రకారం కూర్చోవాలని కొంత మంది, అవసరం లేదని సీట్లల్లో కూర్చున్న వాళ్లు వాదించు కుంటున్నారు. కానీ ఎప్పుడూ ముందుండే నేను, నాక్కావాల్సిన కిటికీ పక్కన సీటు సంపాదించుకున్నాను.

బెజవాడ నుంచి బందరు రెండు గంటల ప్రయాణం. అదీ కిటికీ దగ్గర సీటైతే అర గంటలో అయిపోయినట్టుం టుంది. చుట్టూ పచ్చటి పొలాలు, దారి పొడుగునా మనల్ని పలకరించే పంట కాలువ. ఒక పక్కన ఎత్తైన కొండలు. 'స్వర్గానికి దారా?' అన్నట్టుంటుంది. శ్రావణమాసం నుంచి సంక్రాంతి దాకా అయితే చెప్పటానికి మాటలు చాలవు. ఆ ప్రయాణాన్ని అనుభవించి తీరాల్సిందే! పచ్చటి తివాచీ పరిచి నట్టు చేలు, గాలికి నృత్యం చేస్తూ, మనను ఆహ్వానిస్తున్నట్టుంటాయి. అందుకే ఎంత వీలు కాకపోయినా,

కిటికీ దగ్గర సీటు ఎలాగో అలా సంపాదిస్తాను.

నా సీట్లో నా పక్కన కూర్చున్నది ఓ కుర్రాడు. పాతిక్కి మించదు వయసు. బస్సు బయలుదేరింది. అప్పటి దాకా ఉక్కిరిబిక్కిరైన ప్రాణం, చల్ల గాలి తగిలి, సేదదీరినట్టైంది. నుంచునున్న ప్రయాణికులు సర్దుకున్నట్టున్నారు. మా పక్క కి ఓ పంచె కట్టుకున్నాయన, డెబ్బై ఏళ్లుంటాయేమో, వచ్చి నుంచున్నాడు. నా పక్కన కూర్చున్న కుర్రాడు తల పైకెత్తి చూశాడు. వెంటనే "మీరా మాస్టారూ, రండి, కూర్చోండి" అన్నాడతను లేచి నిలబడి.

"ఎవరు బాబూ, పోల్చలే. పెద్దతనం కదా. దృష్టి ఆనడం లేదు" అన్నాడాయన కళ్లు చికిలించి చూస్తూ.

"నేను మాస్టారూ, సుబ్రహ్మణ్యాన్ని. మీ ఇంట్లో ఉండి చదువుకున్నాను" అన్నాడతను వినయంగా.

ఆ ముసలాయనకు గుర్తు రానట్టుంది, తల గోక్కుం టూ గుర్తు తెచ్చుకో ప్రయత్నిస్తున్నాడు.

"అదే మాస్టారూ, వారాలు చేసుకుంటూ మీ దగ్గర కొస్తే ... 'చదువు పాడై పోతుంది. ఆ తినేదేదో మా ఇంట్లోనే ఉండి తిని, ఇక్కడే ఉండి చదువుకో' మన్నారు. ఆ సుబ్రహ్మణ్యాన్ని. ఇపుడు గుర్తు కొచ్చిందా?" ఆత్రుతగా ఆయన మొహంలోకి చూస్తూ అన్నాడా కుర్రాడు.

"ఓ, నువ్వా నాయనా! భాగున్నావా?" గుర్తు పట్టిన సంతోషం ఆయన ముఖంలో స్పష్టంగా కనిపిస్తుంటే ప్రశ్నిం చారాయన.

"బాగున్నాను మాస్టారూ, మీ దయ వల్ల. బందర్లో ఉద్యోగం. ఉండడం విజయవాడలో. రోజూ వెళ్లొస్తుంటాను. రండి, కూర్చోండి" అన్నాడు కుర్రాడు మళ్లీ.

"వద్దులే నాయనా. కూర్చో. ఆఫీసులో పని చెయ్యాల్సిన వాడివి. నేనైతే ఇంటి కెళ్లి విశ్రాంతి తీసుకోవడమేగా!" అన్నాడాయన మొహమాటంగా. కానీ ఆ మొహంలో అలసట, వృద్ధాప్యపు నీరసం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"అదేమిటి మాస్టారూ? మీ సహాయం వల్ల ఇంత వాడి నయ్యాను. మీరే కనక సహాయం చేయనట్టైతే ఈ రోజు నేనిలా ఉండే వాడినా? మీ రెప్పుడూ నా దగ్గ రేమీ తీసుకో లేదు. నాకు ఉద్యోగం వచ్చిం తర్వాత. కనీసం నా దగ్గర బస్సులో ఈ సీటన్నా తీసుకోరా?' ' బతిమాలుతున్నట్టు అడిగాడా కుర్రాడు.

"వద్దులే బాబూ. నువ్వే కూర్చో" అయన కంఠం ఈ సారి నిశ్చయం ధ్వనించింది, అదే ఆఖరి మాటన్నట్టు.

ఏమనుకున్నాడో ఏమో, మరి మాట్లాడ లేదా కుర్రాడు. ప్రయాణం పూర్తయ్యే వరకూ తలొంచుకు కూర్చున్నాడు.

నాకు కొంచెం కుతూహలం ఎక్కువ. అలసటగా ఉన్నా, సీటు తన విద్యార్థి ఇస్తానన్నా, ఎందు కొద్దన్నాడాయన? ఈ ప్రశ్న నా మెదడును తొలిచేస్తోంది. 'ఆ విషయం ఆయన్నే అడిగితే పోలా దిగిం తర్వాత?' అనుకుని కూర్చున్నాను.

బందరు వచ్చింది. ఎవరి దారిన వాళ్లు వెళ్లి పోతున్నారు. దిగి నడిచెళ్లి పోతు న్నాయన్ను ఆపి అడిగాను, "మాస్టారూ, ఆ కుర్రాడు మీ విద్యార్థే గదా. ఎంత బతిమాలినా మీ రెందుకు కూర్చో లేదు?" అని. నా కుతూహలానికి నాకే సిగ్గేసింది.

దాని కాయన నవ్వి, "నే నా కుర్రాడికి ఎప్పుడో సహాయం చేశాను. ఆ విషయం నాకు గుర్తు లేదు. సహాయం అంటే ఏదీ తిరిగి ఆశించకుండా చేసేది" ఊపిరి తీసుకోడానికన్నట్టు ఆగా డాయన. "నేను మరిచి పోయిన విషయాన్ని ఆ కుర్రాడు గుర్తు చేశాడు. సహాయానికి ప్రతిఫలంగా ఆ సీటు తీసు కోమన్నాడు. నేనిప్పుడా సీటులో కూర్చుంటే, ఋణం ఇచ్చి తిరిగి వసూలు చేసుకున్న ట్టవుతుంది తప్ప సహాయం చేసినట్టవదు. అందుకే నే నా సీటులో కూర్చోలేదు" అని చెప్పి, వెళ్లి పోయాడు.

'పందిరి నిలబడ్డానికి గుంజలెలా సహాయ పడతాయో, బహుశా మనుషుల్లో మానవత్వం ఈ మాత్రమైనా ఉండటానికి ఇలాంటి వాళ్లే కారణం అయుంటుం'దనుకుంటూ నే నింటి దారి పట్టాను.

(P)




## అపురూపమైన ఆపరేషన్!

థాయ్‌లాండ్‌లోని 'ఏసియన్ ఎలిఫెంట్ హాస్పిటల్'లో ఇటీవల ఈ ఏనుగు మెదడుకి ఆపరేషన్ చేసి, ఆరున్నర కిలోల బరువున్న (ఎక్స్‌రేద్వారా కనుక్కున్న) కణితిని తీసివేశారు. ఇది అసహజంగా ప్రవర్తిస్తుండటంతో (అనవసరంగా తోటి ఏనుగులతో కయ్యాలకి దిగడం, చెట్లని ధ్వంసం చేయడంలాంటివి), దాని మెదడులో లోపం ఉందని అనుమానించారు డాక్టర్లు. అది నిజం అయింది. ఓ ఏనుగు మెదడుకి ఆపరేషన్ చేయడం చరిత్రలో ఇదే మొదటిసారి!

-ఎం. లిపి